సాక్షి
నంద్యాల
శనివారం । 25 । మే । 2024



శాస్త్రోక్తంగా ఊయల సేవ

శ్రీశైలం: పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. అలాగే భ్రమరాంబదేవికి లక్ష కుంకుమార్చన చేశారు.



బాణసంచా స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 74 బాక్సుల బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ చలపతి శుక్రవారం తెలిపారు.



థైరాయిడ్‌తో జాగ్రత్త !

కర్నూలు(హాస్పిటల్): ప్రతి పది మందిలో ఒకరికి థైరాయిడ్ సమస్య వస్తోంది. గొంతు వాపు రాకపోయినా హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడ్‌గా పిలిచే ఈ సమస్య జనాన్ని తీవ్రంగా వేధిస్తోంది. ..8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు



వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఈవీఎంలు భద్రపరిచిన ఆర్జీఎం, శాంతిరామ్ కళాశాలను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లను కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 4 తేదీన కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బాణాసంచా పేల్చేందుకు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, సంతోష్, పాణ్యం సీఐ నల్లప్ప ఉన్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. శుక్రవారం యార్డులో సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.17,000, మధ్యస్థ ధర రూ.14,100, కనిష్ట ధర రూ.12,000గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు.

నేడు మధ్యప్రదేశ్ సీఎం రాక

శ్రీశైలం: శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనార్థమై మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఉదయం శ్రీశైలం చేరుకుంటారని ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10.45 గంటలకు సున్నిపెంట చేరుకుంటారని చెప్పారు. ఉదయం 11 గంటలకు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని తెలిపారు.

ఐదుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన పరీక్షలకు 88 శాతం హాజరు నమోదైనట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 3,452 మందికి 3,054 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 8,306 మందికి 7,635 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కర్నూలు డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల, పత్తికొండ శ్రీ రాఘవేంద్ర డిగ్రీ కళాశాల, ఆళ్లగడ్డ అనంత డిగ్రీ కళా శాల, నంద్యాల ఎస్పీవై రెడ్డి డిగ్రీ కళాశాలల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఐదుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

ఎంటీపీ యాక్ట్‌కు రిజిస్ట్రేషన్ చేయించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కాంప్రహెన్సివ్ అబార్షన్ కేర్(ఎంటీపీ యాక్ట్) రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆసుపత్రుల యాజమాన్యాలకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మెడికల్ కాలేజీలోని ఓల్డ్ లెక్చర్ గ్యాలరీలో ఎంటీపీ యాక్ట్, బేటీ బచావో బేటీ పడావో అంశాలపై ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యులు, మేనేజర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటీపీ యాక్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని జిల్లా స్థాయి కమిటీ ఆమోదం అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నట్లు తెలిపారు.

చేనేతకు నేస్తమై.. పరిశ్రమకు ఊతమై!

- ఒక జిల్లా-ఒక ఉత్పత్తి కింద బనగానపల్లె ఏరియా చేనేత వస్త్రాలు ఎంపిక
- జాతీయ స్థాయి అవార్డుకు ప్రతిపాదనలు
- జిల్లాలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి అవకాశం
- 'నేతన్న నేస్తం'తో కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహం



బనగానపల్లెలో వస్త్రాన్ని నేస్తున్న చేనేత కార్మికుడు



మగ్గాలపై తయారైన లుంగీలు, టువాళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లాలో చేనేత పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు చేనేత, జౌళిశాఖ చర్యలు చేపట్టింది. కర్నూలు జిల్లాతో పోలిస్తే నంద్యాల జిల్లాలో చేనేత పరిశ్రమ అంతగా అభివృద్ధి చెందలేదు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో కూడా చేనేత వస్త్రాల ఉత్పత్తి, మార్కెటింగ్‌ను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' కింద నంద్యాల జిల్లా బనగానపల్లె ఏరియాలో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలకు జాతీయ అవార్డు కోసం చేనేత, జౌళిశాఖ ప్రతిపాదనలు పంపింది. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ చేనేత, జౌళి శాఖ ఉమ్మడిగానే ఉంది. నంద్యాల జిల్లాలోని బనగానపల్లె ప్రాంతంలో నందివర్గం, కోవెలకుంట్ల, ఇల్లూరు కొత్తపేట, పలుకూరు, బిజినవేముల ప్రాంతాల్లో 150 కుటుంబాలు చేనేత వృత్తిపైనే ఆధారపడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం కింద చేనేత పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం బనగానపల్లె క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రామ్‌ను అమలు చేసింది. ఇందులో 97 మంది వీవర్‌లు సభ్యులుగా ఉన్నారు. వీరికి అధునాతన చేనేత మగ్గాలు, ఇతర పరికరాలను రూ.1.20 కోట్లతో అమలు చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇది వరకే మొదటి విడత కింద రూ.44.42 లక్షలతో చేనేత మగ్గాలు, పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నంద్యాల జిల్లాలో చేనేత పరిశ్రమ ఊపిరి పోసుకుంది. చేనేత పరిశ్రమకు మరింత ప్రాచుర్యం కల్పించడానికి 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' కింద జాతీయ స్థాయిలో అవార్డు కోసం నివేదిక పంపడం విశేషం. జాతీయ స్థాయి పురస్కారం లభిస్తే చేనేత పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. నివేదికలో చేనేత వస్త్రాల ఉత్పత్తి, వాటి నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర వివరాలు వివరించారు.

రూ.కోటి విలువైన వస్త్రాల ఉత్పత్తి..

బనగానపల్లె ప్రాంతంలో చేనేత పరిశ్రమ గడిచిన ఐదేళ్లలో విశేషంగా అభివృద్ధి చెందింది. 2018-19 వరకు ఈ ప్రాంతంలో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరకపోయింది. కేవలం 50 కుటుంబాల వరకు చేనేతలు ఉండగా, వస్త్రాల ఉత్పత్తి రూ.30 లక్షల విలువ వరకు కూడా లేదు. 2019 - 20 నుంచి చేనేత పరిశ్రమ అభివృద్ధికి వైఎస్సార్ నేతన్న నేస్తం అమలు చేయడంతో ఒక్క బనగానపల్లె ప్రాంతమైన నందివర్గం, కోవెలకుంట్ల, ఐ.కొత్తపేట, పలుకూరు, బిజినవేములలో చేనేత వస్త్రాల ఉత్పత్తి రూ.కోటికి చేరింది. నందివర్గం చేనేత సహకారం సంఘం మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది. చేనేత పరిశ్రమను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే ఒక జిల్లా- ఒక ఉత్పత్తి కింద కేంద్ర ప్రభుత్వం అవార్డుకు ప్రతిపాదన చేయడం విశేషం. ఈ ప్రాంతంలో కేవలం టువాళ్లు, లుంగీలు ప్రధానంగా ఉత్పత్తి చేస్తారు. వీటితో పాటు ఖాదీ వస్త్రాలు కూడా ఉత్పత్తి అవుతున్నాయి. చేతులతో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఉత్పత్తి చేస్తున్న టువాళ్లు, లుంగీలు, ఖాదీ వస్త్రాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు చేపట్టినా... నందివర్గం చేనేత సహకార సంఘం ఉత్పత్తి చేసిన ఉత్పత్తులు విధిగా ఉంటాయి.

మరింత గుర్తింపు లభిస్తుంది



ఒక జిల్లా - ఒక ఉత్పత్తి కింద బనగానపల్లె ఏరియాలో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలకు జాతీయ అవార్డు కోసం ప్రతిపాదనలు పంపాం. జాతీయ స్థాయి అవార్డు లభిస్తే ఇక్కడ ఉత్పత్తి అయ్యే వస్త్రాలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది. నంద్యాల జిల్లాలో చేనేత అభివృద్ధికి అవకాశం ఉంటుంది. **- హరికృష్ణ, సహాయ సంచాలకులు చేనేత, జౌళిశాఖ, ఉమ్మడి కర్నూలు జిల్లా**

ఓట్ల లెక్కింపునకు మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంబంధించి మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కౌంటింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ సూచించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కోసం 813 మంది సిబ్బందిని సీపీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో ఈ ప్రక్రియను చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం.దాసు, కామేశ్వరరావు, ఎన్ఐసీ నెట్‌వర్క్ ఇంజినీర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ల వారీగా ఫలితాలు నమోదు చేయండి

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికలు-2024 కౌంటింగ్‌కు సంబంధించి ఎన్నికల ఫలితాలు రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి జిల్లాలోని ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు సంబంధించి వివరాలను రౌండ్ల వారీగా ప్రజలు ఎప్పటికప్పుడు results.eci.gov.in వెబ్‌సైట్‌లో, Voter Helpline యాప్‌లో, Election Trends Tvలో తెలుసుకునేందుకు వీలుగా జాగ్రత్తగా నమోదు చేయాలని శిక్షణ పొందుతున్న కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులకు సూచించారు. ఈ డేటా ఎంట్రీతో ప్రజలు ఎక్కడి నుంచైనా ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుందన్నారు. ఈ సమయంలో కంప్యూటర్ సహాయకులు అప్రమత్తంగా ఉండి వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి పద్మజ, మున్సిపల్ ఇంజనీర్ మధు కుమార్, అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఇంటర్, పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,968 మంది విద్యార్థులకు గాను 1,207 మంది పరీక్షకు హాజరయ్యారు. 1,761 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల హాజరు 41 శాతంగా నమోదైందన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 13 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు..

జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు డీవీఈఓ సునీత తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 2,215 మందికి గాను 2,078 మంది హాజరు కాగా 134 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం తెలుగు పరీక్షకు 89 మందికి గాను 82 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల ఎదుట 144 సెక్షన్ అమలులో ఉందని డీవీఈఓ తెలిపారు.

రుచి.. చిగురించె!



గోస్పాడులో రహదారి వెంబడి పూత, చిగురుతో కళకళలాడుతున్న చింత చెట్లు

చింత చిగురుతో చేసిన వంటకం ఏదైనా సరై ఆ పేరు వింటే భోజన ప్రియులకు నోరూరాల్సిందే. ఏటా ఏప్రిల్ మొదలుకొని జూలై నెల వరకు చిగురు కోతకు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఎక్కడ చూసినా చిగురు విక్రయదారులు కనిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చింత కూపుల నుంచి చిగురు సేకరించి పట్టణాల్లో విక్రయిస్తున్నారు. చిన్న చిన్న కుప్పలుగా వేసి రూ. 15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. రుచితో పాటు పోషకాలు మెండుగా ఉండటంతో చిగురు వినియోగం పెరిగిపోయింది. కాయగూరల్లోనే కాదు.. చేపలు, రొయ్యలు, మటన్ వంటి మాంసాహార వంటకాల్లోనూ జత చేస్తారు. అలాగే చిగురుతో చెట్నీ, పులిహోర, రసం పొడి తయారు చేస్తారు. ఇందులో విటమిన్-సీ కూడా లభ్యమవుతుందని, మనిషిలో నష్టపోయిన కణజాలన్ని సరి చేస్తుందని, ముఖ్యంగా ఎముకలు, దంతాలు గట్టిగా ఉండేలా దోహదం చేస్తుందని సీజనల్‌గా వచ్చే చిగురును ప్రతి ఒక్కరూ వాడటం మంచిదేనని గోస్పాడు వైద్యాధికారి డాక్టర్ గోపాల్ చెబుతున్నారు. - గోస్పాడు

మధ్యాహ్నం వరకు ఎండ.. సాయంత్రానికి వాన

కర్నూలు(అగ్రికల్చర్): ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. 10 రోజుల తర్వాత శుక్రవారం ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. వడగాలుల తీవ్రత అధికమైంది. ఎండల వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రానికి ఉపశమనం దక్కింది. 6 గంటల ప్రాంతం నుంచి కర్నూలు సహా వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. కర్నూలు జిల్లా మంత్రాలయంలో 41.6 డిగ్రీలు, కర్నూలులో 41.4, కౌతాళంలో 41.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా బనగానపల్లిలో 42.2, మిడుతూరులో 41.7, పాణ్యంలో 41.4, డోన్‌లో 41.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

హైదరాబాద్ నుంచి ఏపీఈఆర్‌సీకి విముక్తి

జూన్ 2న కర్నూలు నుంచి ఏపీఈఆర్‌సీ సేవలు

- రూ.23 కోట్లతో నిర్మించిన విద్యుత్ నియంత్రణ మండలి భవనాన్ని ప్రారంభించిన చైర్మన్ నాగార్జునరెడ్డి
- నిరాడంబరంగా ప్రారంభోత్సవ కార్యక్రమం



ఏపీఈఆర్‌సీ నూతన భవనం



భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ నాగార్జునరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): పదేళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) కర్నూలు కేంద్రంగా పనిచేయడానికి రంగం సిద్ధమైంది. రూ.23 కోట్లతో నిర్మించిన ఏపీఈఆర్‌సీ భవనాన్ని చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం నిరాడంబరంగా సాగింది. హైదరాబాద్ 10 ఏళ్ల ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ చంద్రబాబు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను 2015లోనే ఏపీకి తరలించారు. ఒక్క విద్యుత్ నియంత్రణ మండలి మాత్రమే హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఉమ్మడి రాజధాని గడువు జూన్ 2న ముగియనుండటంతో కర్నూలులో ఏర్పాటు కానుంది. ఎన్నికల కోడ్ ఉండటం వల్ల ఎలాంటి ఆడంబరాలు లేకుండా ఏపీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జునరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత ప్రారంభోత్సవం చేపట్టారు. కర్నూలు శివారులోని ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన 220 కేవీ కార్బైడ్ సబ్ స్టేషన్‌కు చెందిన 2 ఎకరాల భూమిలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుంచి కర్నూలు కేంద్రంగా ఏపీఈఆర్‌సీ పనిచేస్తుందని తెలిపారు. 2023 జూన్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఏడాదిలోపే భవన నిర్మాణం పనులు పూర్తి కావడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌లో ఉన్న ఏపీఈఆర్‌సీ కార్యాలయం సామగ్రిని వెంటనే కర్నూలుకు తరలిస్తామన్నారు. ఏపీఈఆర్‌సీ ద్వారా విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెంబరు టెక్నికల్ రాంసింగ్, ఫైనాన్స్ మెంబర్ పీఆర్‌కే రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు, విద్యుత్ శాఖ సివిల్ ఎస్ఈ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26న కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



సమావేశంలో పాల్గొన్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థులకు ఈ నెల 26న (ఆదివారం) ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు జిల్లా కురువ సంఘం గౌరవాధ్యక్షులు కె.కిష్టన్న.. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్ ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక పెద్దపాడు రోడ్డులోని ఏపీ మోడల్ స్కూల్ పక్కనున్న శ్రీశ్రీ బీరప్ప స్వామి దేవాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి కురువ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, సంఘం సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, కోశాధికారి కేసీ నాగన్న, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న నాగలింగారెడ్డి

శ్రీశైలం ప్రాజెక్ట్: కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగలింగారెడ్డి శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతాన్ని మెరుగు పరచాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య, అధ్యాపకులు డాక్టర్ ఎం పద్మ, డాక్టర్ ఎస్ శివనాగిరెడ్డి, డాక్టర్ కె రాజన్న, ఎస్ మహేశ్వరరెడ్డి, బాలు, పూర్ణేశ్వరరెడ్డి, శర్మ, షాహిదా, కళ్యాణి, శష్మా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లారీలు సీజ్

కర్నూలు (న్యూటౌన్): బనగానపల్లె నుంచి కర్ణాటక రాష్ట్రంలోని టిప్‌టూర్‌కు అక్రమంగా లైమ్‌స్టోన్ చిప్స్‌ను రవాణా చేస్తున్న రెండు లారీలను జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. అక్రమంగా లైమ్‌స్టోన్ చిప్స్‌ను తరలిస్తున్నారనే సమాచారంతో మైనింగ్ విజిలెన్స్ అధికారులు నిఘా ఉంచారు. డోన్ సమీపంలోని హైవేపై వాహనాలను తనిఖీ చేయగా రెండు లారీలలో కోళ్లదాన కోసం ఉపయోగించే లైమ్‌స్టోన్ చిప్స్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అనంతరం రెండు లారీలను ప్యాపిలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

థైరాయిడ్‌తో ఆరోగ్యం అయోమయం

- థైరాయిడ్ వస్తే ఎన్నో ఇబ్బందులు
- జీవితం నిస్సారమైన భావన
- మందులు, వ్యాయామంతో నియంత్రణ
- జిల్లాలో 10 శాతం మందికి వ్యాధి
- నేడు వరల్డ్ థైరాయిడ్ డే

ఒకప్పుడు థైరాయిడ్ అంటే గొంతు వద్ద వాపు ఉన్న వారులే అనుకునేవారు. కానీ ఇప్పుడు ప్రతి పది మందిలో ఒకరికి ఈ సమస్య వస్తోంది. గొంతు వాపు రాకపోయినా హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడ్‌గా పిలిచే ఈ సమస్య జనాన్ని తీవ్రంగా వేధిస్తోంది. నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక సమస్యగా మారి శరీరాన్ని ఛిద్రం చేస్తుంది. ఈ గ్రంథి పనిచేయకపోతే దేహంలోని ఇతర అవయవాల పనితీరు మందగిస్తుంది. ఈనెల 25న 'వరల్డ్ థైరాయిడ్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం.

– కర్నూలు(హాస్పిటల్)



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగం ఓపీలో చికిత్స కోసం వచ్చిన రోగులు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగంలో హార్మోన్ల అసమతుల్యతల వల్ల వచ్చే వ్యాధులకు చికిత్స చేస్తారు. ఇందులో థైరాయిడ్ వ్యాధి ఒకటి. ఈ విభాగంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ చికిత్స చేస్తారు. ఈ విభాగానికి థైరాయిడ్ సమస్యతో ప్రతి నెలా 600 నుంచి 700 మంది చికిత్స కోసం వస్తారు. ఇందులో 400 నుంచి 500 మంది హైపోథైరాయిడిజం, 200 మంది హైపర్ థైరాయిడిజంతో బాధపడుతున్న వారున్నారు. ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం ప్రతిరోజూ 80 నుంచి 120 మందికి పైగా థైరాయిడ్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. వారి వద్ద సగటున నెలకు 2వేల మందికి పైగా చికిత్స పొందుతున్నారు. మొత్తం థైరాయిడ్ రోగుల్లో 70 శాతం మందికి హైపో థైరాయిడ్, 30 శాతం మందికి హైపర్ థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఈ సమస్య ఇప్పుడు బాధిస్తోంది. స్త్రీలలో 20 శాతం, పురుషులలో 15 మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. వీరిలో కొందరికి గాయిటర్(గొంతు వద్ద గడ్డ) ఉంటోంది. ఇలా కణితి ఉన్న వారికి ఆపరేషన్ అవసరం లేదు. క్యాన్సర్‌గా మారితేనే ఆపరేషన్ చేయించుకోవాలి. గడ్డలు ఏర్పడిన వారిలో 5 శాతం మందిలో మాత్రమే క్యాన్సర్ కణితిలు ఉంటాయి. వీరికి మాత్రమే ఆపరేషన్ చేసి కణితి తొలగించాల్సి ఉంటుంది.

థైరాయిడ్ వ్యాధుల లక్షణాలు

హైపో థైరాయిడ్

నీరసం, మలబద్ధకం, చర్మం, వెంట్రుకలు పొడిబారడం, ఎక్కువ నిద్ర, బరువు పెరగడం, నెలసరిలో రక్తస్రావం ఎక్కువగా లేక తక్కువగా అవ్వడం, గర్భస్రావం, చలిని తట్టుకోలేకపోవడం, గుండె తక్కువసార్లు కొట్టుకోవడం, జుట్టు రాలడం, థైరాయిడ్ గ్రంథి వాపు తదితర లక్షణాలు ఉంటాయి.

హైపర్ థైరాయిడ్

ఆకలి ఎక్కువ అవ్వడం, బరువు తగ్గడం, చెమటలు ఎక్కువ పట్టడం, చిరాకు, స్థిమితం లేకపోవడం, నిద్రలేమి, నీరసం, ఎక్కువసార్లు విరేచనాలు అవ్వడం, నెలసరిలో రక్తస్రావం తక్కువగా అవ్వడం, వేడిని తట్టుకోలేకపోవడం, గొంతు ముందు వాపు, గుండె దడగా అనిపించడం, కళ్లు పెద్దవిగా అవ్వడం ,చేతులు వణకడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి.

థైరాయిడ్ అంటే..

థైరాయిడ్ అనేది సీతాకొకచిలుక ఆకారంలో కంఠం వద్ద ఉండే ఒక ఎండోక్రైన్‌గ్లాండ్. ఇది థైరాక్సిన్ అనే థైరాయిడ్ హార్మోన్‌ను విడుదల చేయడం ద్వారా శరీరంలో అనేక జీవక్రియలను ప్రభావితం చేస్తుంది. తగినంత థైరాయిడ్ హార్మోన్ విడుదల కాకపోవడం(హైపోథైరాయిడిజం), అవసరమైన దాని కన్నా ఎక్కువగా థైరాయిడ్ విడుదల కావడం(హైపర్ థైరాయిడిజం), థైరాయిడ్ స్వెల్లింగ్(గాయిటర్), థైరాయిడ్ ట్యూమర్స్, థైరాయిడ్ క్యాన్సర్స్ ఉంటాయి. హైపోథైరాయిడిజం, హైపర్ థైరాయిడిజం అనేవి చాలా సాధారణంగా కనిపించే థైరాయిడ్ వ్యాధులు. హైపోథైరాయిడ్ సమస్య హైపర్ థైరాయిడ్ కన్నా ఐదు రెట్లు అధికంగా ఉంది. ఎక్కువగా ఈ రెండు సమస్యలే వస్తున్నాయి. గర్భిణుల్లో ఈ సమస్యను ముందుగానే గుర్తించకపోతే, పుట్టే పిల్లల్లో మేధోపరమైన లోపాలు రావచ్చు. చిన్నతనంలోనే ఈ సమస్య గుర్తించడం మంచిది. లేదంటే పిల్లల ఎదుగుదల శారీరకంగానే కాదు మానసికంగానూ మందగించే ప్రమాదం ఉంది. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి సరిగ్గా లేకపోవడం వల్ల హార్మోన్లు అసమతుల్యం అవుతాయి. తద్వారా థైరాయిడ్ వస్తుంది.

గాయిటర్

గాయిటర్ సాధారణంగా 40 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నా, థైరాయిడ్ సమస్యతో బాధపడే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అధిక బరువు, ఇన్సులిన్ రెసిస్టెన్స్, మెటబాలిక్ సిండ్రోమ్ ఉన్న వారిలో గాయిటర్ వచ్చే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

థైరాయిడ్‌ను పూర్తిగా నయం చేయలేం. కానీ మందులు, జీవనశైలి మార్పుల సాయంతో నియంత్రించవచ్చు. థైరాయిడ్ బాధితులు ఒత్తిడికి దూరంగా ఉండాలి. మానసిక, శారీరక ఒత్తిడి శరీరంలో ఇబ్బందులు పెంచుతుంది. ఒత్తిడిని తొలగించుకోవడానికి ధ్యానం అలవాటు చేసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకోవాలి. ఆహారంలో తగినంత కాల్షియం, ప్రొటీన్, అయోడిన్, మెగ్నీషియం ఉంటే థైరాయిడ్ పనితీరు మెరుగ్గా ఉంటుంది. అలాగే విటమిన్ ఎ, బి, సి అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకునేందుకు, జీవక్రియ మెరుగుపడేందుకు రోజూ వ్యాయామం చేయాలి. క్యాబేజీ, క్యాలిఫ్లవర్, పాలకూర, ముల్లంగి, సోయాబీన్స్, స్ట్రాబెర్రీలను తినడం తగ్గించాలి. పాలు, ఛీజ్, మాంసం, చేపలు, ఖర్జూరం, గుడ్లు, తెల్లసొన తినాలి. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఇక రోజూ వరగడుపునే మాత్రలు తీసుకోవడం వల్ల సమస్య నియంత్రణలో ఉంటుంది. విటమిన్–డి లోపం వల్ల కూడా థైరాయిడ్ సమస్య వస్తుంది. ప్రతిరోజూ కనీసం 15 నిమిషాలు సూర్యరశ్మి శరీరానికి తగిలేలా చూసుకోవాలి. అవిసె గింజలు ఎక్కువగా తీసుకోవాలి. ఉప్పును అవసరమైన దానికంటే ఎక్కువ తీసుకుంటే థైరాక్సిన్ ఎక్కువ ఉత్పత్తి చేసి హైపర్ థైరాయిడ్ కలిగేలా చేస్తుంది. ఈ సమస్య ఉన్న వారు రోజుకు 5 గ్రాముల ఉప్పును మాత్రమే తీసుకోవాలి. వాల్నట్స్ మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. అది థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగుపరుస్తుంది. దీంతో థైరాక్సిన్ అవసరమున్నంత మేర శరీరానికి అంది థైరాయిడ్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఆరు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి



థైరాయిడ్ జబ్బున్న వారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ, క్రమం తప్పకుండా మందులు వాడుతూ ఉంటే ఏమీ కాదు. హైపోథైరాయిడిజం ఉన్న వారు నార్మల్‌గా ఉన్నా ప్రతి ఆరు నెలలకోసారి థైరాయిడ్ పరీక్ష చేయించుకుంటూ ఉండాలి. హైపర్ థైరాయిడిజం ఉన్న వారు మూడు నెలలకోసారి చేయించుకోవాలి. వీరు క్యాబేజీ, కాలిఫ్లవర్‌కు దూరంగా ఉండాలి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో థైరాయిడ్ పరీక్ష ఉచితంగా చేస్తున్నాం. ఈ వ్యాధికి అయ్యే మందుల ఖరీదు కూడా చాలా తక్కువ.

– డాక్టర్ పి.శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భిణులు తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్ష చేయించుకోవాలి. థైరాయిడ్ నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. ఆరు వారాల తర్వాత తిరిగి పరీక్ష చేయించి సమీక్షించుకోవాలి. అనంతరం ప్రతి మూడు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి. ప్రసవం తర్వాత కూడా పరీక్ష చేయించుకుని మందులు వాడాలి. గర్భిణులకు ఇది వరకే థైరాయిడ్ ఉండి మందులు వాడకపోతే పుట్టబోయే బిడ్డకు ఈ జబ్బు వస్తుంది. ప్రసవం అయిన వెంటనే బిడ్డకు కూడా థైరాయిడ్ పరీక్ష చేయించడం మంచిది. పిల్లలకు థైరాయిడ్ ఉన్నా మందులు వాడకపోతే బుద్ధిమాంద్యం వస్తుంది.

– డాక్టర్ కె. కావ్య, గైనకాలజిస్టు, కర్నూలు

ఏపీఎస్‌ఈబీఈఏ భవన్ ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక బాబా బృందావన్ నగర్‌లో నిర్మించిన ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ ఇంజినీర్ల అసోసియేషన్ భవనాన్ని శుక్రవారం విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ(విజిలెన్స్) మల్లారెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. బిల్డింగ్ కమిటీకి విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి చైర్మన్‌గా వ్యవహరించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు ఎం.ఉమాపతి మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం నిర్మించిన అతిథి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించడం సంతోషకమన్నారు. ఏపీ ఎస్‌ఈబీఈఏ సమన్వయం, ఐకమత్యంతో వ్యవహరించడం వల్ల అన్ని హంగులతో కొత్తభవనం సాకారమైందన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శామ్యూల్, నాగప్రసాద్, జిల్లా నేతలు జగదీశ్వరరెడ్డి, గంగన్న, రాజేంద్రబాబు, రవికుమార్‌రెడ్డి, స్వరూప్, రంగస్వామి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన రమేష్

సి.బెళగల్: ముగ్గురు వ్యక్తులను తనను హత్య చేసేందుకు యత్నించారని మండలంలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన మండ్ల రమేష్ శుక్రవారం తెలిపారు. పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండగా తన సోదరుడు మండ్ల రామలింగయ్య, అతడి కుమారులు రాంబాబు, రవి ఆస్తి విషయమై గొడవ పెట్టుకున్నారని రమేష్ తెలిపాడు. ఒకరు ఎడ్ల బండి గుంజ, మరొకరు కర్ర, ఇంకొకరు కొడవలితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో స్పృహతప్పి పడిపోయానన్నాడు. తాను చనిపోయానని భావించి ముగ్గురూ అక్కడి నుంచి వెళ్లిపోయ్యారని, కాసేపటి తర్వాత తన కుటుంబ సభ్యులు తన ను స్థానిక పీహెచ్‌సీకి తరలించారని చెప్పా డు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని బాధితుడు తెలిపాడు. ఇదే విషయమై ఎస్‌ఐ తిమ్మారెడ్డిని వివరణ కోరగా రమేష్‌పై దాడి జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

లోన్ ఇస్తామంటూ బురిడీ

- రూ.5 లక్షలు లోన్ ఇస్తామంటూ రూ.లక్ష కాజేసిన సైబర్ నేరగాళ్లు
- సైబర్ నేరగాళ్ల మోసానికి బలైన ఆదోనివాసి



బాధితు వెంకటరాముడు

ఆదోని అర్బన్: లోన్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని బురిడీ కొట్టించారు. ప్రాసెసింగ్ ఫీజు పేరుతో విడతల వారీగా ఫోన్ పే ద్వారా రూ.1లక్ష కాజేసిన తర్వాత బాధితుడికి జ్ఞానోదయమైంది. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు.. స్థానిక ఇందిరా నగర్‌లోని ఎరుకల కాలనీకి చెందిన వెంకటరాముడికి ఈనెల 20న ఓ ఫోన్ వచ్చింది. తాము బజాజ్ ఫైనాన్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని, రూ.5 లక్షలు లోన్ ఇస్తామని నమ్మబలికారు. ప్రాసెసింగ్ ఫీజు కింద ముందు రూ.3,500 ఫోన్‌పే ద్వారా పంపాలని కోరారు. ఇలా వారు అడిగిన ప్రకారం మూడు రోజుల్లో విడతల వారీగా మొత్తం రూ.1.07 లక్షలు బాధితుడు ఫోన్ పే చేశాడు. ఇంత డబ్బు వేసినా కూడా లోన్ మంజూరు కాలేదని శుక్రవారం ఫోన్ చేసి ప్రశ్నించాడు. చివరిగా రూ.17 వేలు ఫోన్ పే చేస్తే రూ.5 లక్షల లోన్‌తో పాటు ఫోన్ పే చేసిన మొత్తం అమౌంట్ వేస్తామని చెప్పడంతో బాధితుడు మోసపోయానని తెలుసుకున్నాడు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ నరసింహరాజు మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డీవైఈఓ స్క్రీనింగ్ టెస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్(ఏపీఎస్‌పీఎస్‌సీ) నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీవైఈఓ) ఎంపిక కోసం నిర్వహించే స్క్రీనింగ్ టెస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా సమన్వయ అధికారి/డీఆర్వో కె.మధుసూదన్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబరులో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, మెడికల్, రవాణా శాఖాధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న ఉదయం 9 నుంచి 11.30 గంటల మధ్య కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులలోని 8 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో డీవైఈఓ పోస్టు ఎంపిక కోసం స్క్రీనింగ్ టెస్టును నిర్వహించేందుకు ఏపీపీఎస్‌సీ నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలో దాదాపు 2,230 మంది విద్యార్థులు హాజరు కానున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్/ఆన్‌లైన్ సెంటర్లను మూయించాలని, 144 సెక్షన్ విధించాలని, నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, పరీక్షా సమయానికి బస్సులను నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

● వికసించిన 'మే' పుష్పం



'మే' పుష్పం వికసించింది. వాతావరణానికి అనుగుణంగా మే లేదా జూన్ నెలలో ఈ పుష్పం వికసిస్తుంది. ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ మే నెలలోనే సున్నిపెంటలోని మాచిమండ నిహారిక ఇంటిలో మే పుష్పాలు కనువిందు చేస్తున్నాయి.

– శ్రీశైలంప్రాజెక్ట్

కెనరా బ్యాంక్‌లో అగ్నిప్రమాదం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని శ్రీనివాససెంటర్ సమీపంలో ఉన్న కెనరా బ్యాంక్‌లో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి యోగేశ్వరరెడ్డి తెలిపిన వివరాలు.. కెనరా బ్యాంక్ శ్రీనివాసనగర్ బ్రాంచ్‌లో ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సెక్యూరిటీ సిబ్బంది గమనించి వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో బ్యాంక్‌లోని ఫైళ్లు, ఫర్నిచర్ కాలి బూడిదయ్యాయి. బ్యాంక్ సిబ్బంది ఫిర్యాదు మేరకు ఫైర్ అధికారులు విచారణ చేపట్టారు.

రోడ్డుప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్ వెంకటస్వామి

గూడూరు: మండలంలోని పెంచికలపాడు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పత్తికొండ పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ హరిజన వెంకటస్వామి (44) ఆటోలో కర్నూలుకు వెళ్తుండగా తమిళనాడుకు చెందిన లారీ కర్నూలు నుంచి రాయచూర్ వైపు వెళ్తూ పెంచికలపాడు సమీపంలో ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సుంకులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పిడుగు పడి యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన హనుమంతు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శుక్రవారం రాత్రి పిడుగుపడటంతో సోమప్ప నగర్‌కు చెందిన యువకుడు హనమంతు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మార్కెట్‌లో హమాలీగా పని చేసే హనుమంతు రాత్రి వర్షం పడుతుండటంతో బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. వీవర్స్ కాలనీ మైదానం వద్దకు చేరుకోగానే పెద్ద శబ్దంతో పిడుగు హనమంతుపై పడటంతో కిందపడిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు పెద్దాస్పత్రికి తరలించారు. కాగా హనమంతుకు రెండు నెలల క్రితమే వివాహమైనట్లు తండ్రి బడేసాబ్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేటు సమీపాన రైల్వే ట్రాక్‌పై శుక్రవారం తెల్లవారుజామున రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న నంద్యాల రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్, డోన్ రైల్వే ఏఎస్‌ఐ కుమార్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 40 ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని, తల, మొండెం, కాళ్లు వేరుగా తెగిపడ్డాయని ఎస్‌ఐ తెలిపారు. బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నాడని, రెండు చేతుల పైన పచ్చ బొట్టు తప్ప మృతదేహం వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని ఆయన తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాలకు తరలించారు.

మారెమ్మవ్వ ఆలయంలో చోరీ



కంపచెట్లలో పడేసిన అమ్మవారి హుండీ

హాలహర్వి: మండలంలోని అమృతాపురం గ్రామంలో వెలిసిన టోపీ మారెమ్మవ్వ వెండి ఆభరణాలను గుర్తుతెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి దొంగిలించారు. గుడి తలుపులు పగులగొట్టి ఆలయంలోని హుండీని, అమ్మవారికి అలంకరించిన వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయ పూజారి మల్లి పూజలు చేసేందుకు వెళ్లగా అమ్మవారి మెడలోని వెండి నగలు, హుండీ కనిపించలేదు. వెంటనే హాలహర్వి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నరేంద్ర, పోలీసులు ఆలయానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించగా పక్కనే ఉన్న వంకలోని ముళ్ల కంపల్లో హుండీ కనిపించింది. దుండగులు హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నించి వీలుగాకపోవడంతో అక్కడ పడేసి వెళ్లి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. 15 తులాల వెండి ఆభరణాలు, ఒక త్రిశూలం దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ– బైక్ ఢీ

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు గణేష్ నాయక్, ముడావత్ చరణ్ నాయక్

తుగ్గలి: పదో తరగతి పరీక్షలు రాసేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. ఈ ఘటన శుక్రవారం జొన్నగిరి–గిరిగెట్ల మధ్య చోటు చేసుకుంది. సూర్యతండాకు గణేష్‌నాయక్, బాటతండాకు చెందిన రమావత్ చరణ్ నాయక్ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు సూర్యతండాకు చెందిన 9వ తరగతి విద్యార్థి ముడావత్ చరణ్‌తో కలిసి బైక్‌పై తుగ్గలి పరీక్షా కేంద్రానికి బయలు దేరారు. మార్గమధ్యలో గిరిగెట్ల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ – బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధిత విద్యార్థులను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యతండాకు చెందిన గణేష్‌నాయక్, ముడావత్ చరణ్‌నాయక్‌లను కర్నూలుకు తరలించారు. తుగ్గలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.